కార్డు జాడేదీ..?

దరఖాస్తులకే పరిమితమైన ఆహార భద్రత కార్డుల జారీ ప్రక్రియ

- కొత్త కార్డుల కోసం తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ
- ఏళ్లు గడుస్తున్నా.. కార్డుల మంజూరులో తీవ్ర జాప్యం
- మ్యుటేషన్ల దరఖాస్తులను పట్టించుకునే వారే కరువు
- పెండింగ్‌లో 69,326 మ్యుటేషన్ల దరఖాస్తులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఆహార భద్రత కార్డుల జారీ ప్రక్రియ కేవలం దరఖాస్తులకే పరిమితమైంది. దరఖాస్తులు చేసి ఏళ్ల గడుస్తున్నా.. కార్డుల మంజూరులో తీవ్ర జాప్యంతో దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఆసరా పింఛన్లు, ఆరోగ్యశ్రీ, కల్యాణ లక్ష్మీ, ఉపకారవేతనాల మంజూరు, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి దరఖాస్తులకు ఆహార భద్రత కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో కొత్త కార్డుల మంజూరు లేక.. అర్హత ఉన్నా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని దుస్థితి ఏర్పడింది.

దరఖాస్తుదారుల నిరీక్షణ

జిల్లాలో 15 మండలాలకుగాను 5,23,842 ఆహార భద్రత కార్డులు ఉండగా వాటిలోని 17,24,481 మంది సభ్యులకు ప్రతినెలా ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. కార్డులో ఎంత మంది ఉంటే.. అంత మందికి పరిమితి లేకుండా ప్రతినెలా 6 కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు కార్డుకు 35 కిలోల వంతున బియ్యం పంపిణీ చేస్తోంది. కొత్తగా వివాహం చేసుకున్న వారు భార్యాభర్తలు పాత కార్డుల్లో తమ పేర్లను తొలగించుకొని నూతన కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. పాత కార్డుల్లోంచి దరఖాస్తుదారుల పేర్లను తక్షణం తొలగించిన అధికారులు నూతన కార్డులు మంజూరు చేయకపోవడంతో వారి పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. పిల్లలు పుట్టాక వారి పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చడానికి దరఖాస్తు చేసుకుంటున్న వారికి నిరాశే ఎదురవుతోంది. గతంలో 95,040 దరఖాస్తులు రాగా, వాటిలో సుమారు 985 కార్డులను మాత్రమే మంజూరు చేసి సంబంధిత అధికారులు చేతులు దులుపుకున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా మ్యుటేషన్ల(చేర్పులు, మార్పుల) కోసం పెట్టుకున్న 69,326 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రస్తుతం మీ సేవ కేంద్రాల్లో నూతన కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియ అందుబాటులో లేకపోవడంతో పలువురు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు.

వేగవంతం చేయాలి

మా అబ్బాయికి 5 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు రేషన్ కార్డులో పేరు నమోదు కోసం మీ సేవలో దరఖాస్తు చేశా. ఇప్పటికీ అతడి వయస్సు 8 సంవత్సరాలు, తహసీల్దార్ కార్యాలయంలో అడిగితే మా చేతిలో ఏమీ లేదు.. మేము పరిశీలన జరిపి సంబంధిత అధికారులకు పంపించామని చెబుతున్నారు. అర్హులకు ఆహార భద్రత కార్డు అందేలా కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలి.

– బి.కిరణ్‌రెడ్డి, బోడుప్పల్

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా..

మండలాల వారీగా అర్హులైన వారితో జాబితా సిద్ధంగా ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నూతన ఆహార భద్రత కార్డులు మంజూరు చేస్తాం. ప్రభుత్వం ప్రస్తుతం కొత్త రేషన్ కార్డు దరఖాస్తు ప్రక్రియను నిలిపివేసింది. సవరణ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

– తనుజా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

మౌలిక వసతుల కల్పనకు కృషి



సీసీ రోడ్డు శంకుస్థాపనలో మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. చెంగిచర్ల–1 డివిజన్‌లో కమలానగర్ నుంచి యాదయ్య కాలనీ వరకు, అక్కడ నుంచి జయశ్రీ కాలనీ వరకు రూ.46 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా అన్ని డివిజన్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఒకటో డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్, జయశ్రీ కాలనీ అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నాలా సమస్యను పరిష్కరించాలి

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని చిన రాయుని చెరువు నుంచి దినకర్‌నగర్ మీదుగా ప్రవహించే నాలాను సోమవారం ఆమె పరిశీలించారు. గత సంవత్సరం వర్షాకాలంలో దినకర్‌నగర్, శివాలయం ఆలయ ప్రాంగణం మీదుగా నాలాలో వరద ప్రవహించడంతో ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని జలమండలి అధికారులను ఆదేశించారు.



దినకర్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి

కార్యక్రమంలో జలమండలి అధికారులు శేఖర్, ఉదయ్, సూర్యకిరణ్, లక్ష్మణ్, ప్రవీణ్, అరవింద్, కవిత, రంగారావు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

గౌతంనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగంగా పూర్తిచేయాలని స్థానిక కార్పొరేటర్ మేకల సునీతయాదవ్ అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్‌లో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. పనులను వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏఈ దివ్య జ్యోతి, నాయకులు మేకల రాముయాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జునగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మేకల సునీతయాదవ్

పెండింగ్ పనులను పూర్తిచేయాలి



జలమండలి ఎండీ దానకిషోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ చేతన

హబ్సిగూడ: డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ సోమవారం జలమండలి ఎండీ దానకిషోర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని సాయిచిత్రనగర్ యూజీడీ అవుట్ లైన్ పనులు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, వెంటనే పెండింగ్ పనులను పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను పరిష్కరించాలని ఆమె వినతిపత్రంలో కోరారు.

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

కుషాయిగూడ: నిత్యం చెత్తాచెదారం, దుమ్మూ ధూళితో సావాసం చేసే పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. శానిటేషన్ సిబ్బంది కోసం బస్తీ దవాఖానాలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. విధులతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు బీఆర్‌ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, కనక రాజుగౌడ్, బత్తుల శ్రీకాంత్‌యాదవ్, వెంకటేష్, శేఖర్‌నాయక్, మున్సిపల్ సిబ్బంది రాజన్, వరలక్ష్మి, శివ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

బండ చెరువును శుభ్రం చేయండి



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ బండ చెరువును పూర్తిగా ప్రక్షాళన చేయాలని కోరుతూ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, మేయర్ గద్వాల విజయలక్ష్మీని కలిసి వినతిపత్రం అందజేశారు. బండ చెరువులో గుర్రపు డెక్క పెరుగుతుండటంతో దోమల బెడద తీవ్రంగా ఏర్పడిందన్నారు. అదేవిధంగా ఎస్‌టీపీ ప్లాంట్‌ను పెట్టాలని, డ్రైనేజీ, సీవరేజీని డైవర్ట్ చేయాలని ఆమె వినతిపత్రంలో పేర్కొన్నారు.

షాపులో చోరీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మల్లాపూర్: షాపులోని సామాన్లు దొంగలించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ శ్రీవెంకటేశ్వర స్టీల్ షాపు నిర్వాహకుడు బి.వెంకటేష్ సోమవారం నాచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో కూడా ఈ షాపు విషయంలో యాజమానికి, వెంకటేష్‌కు మధ్య కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని పోలీసులు తెలిపారు. నాచారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నాచారం సీఐ తెలిపారు.

క్రీడాకారులు పోరాట పటిమ కలిగి ఉండాలి

ఘట్‌కేసర్: క్రీడాకారులు పోరాట పటిమ కలిగి ఉండాలని విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల(వీబీఐటీ) కార్యదర్శి డాక్టర్ మనోహర్‌రెడ్డి అన్నారు. బాచుపల్లి వీఎన్‌ఆర్ వీజేఐటీలో ఇటీవల నిర్వహించిన ఆలిండియా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానం సాధించిన వీబీఐటీ క్రీడాకారులకు ఆ కళాశాలలో సోమవారం నిర్వహించిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పీవీఎస్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, వివలాల్, విశ్వాస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రాల లీకులపై యూత్ కాంగ్రెస్ నిరసన

ఘట్‌కేసర్: రాష్ట్రంలో టీఎస్‌పీఎస్‌సీ, పదో తరగతి ప్రశ్నాపత్రాల లీక్‌పై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సోమవారం యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షుడు సుశాంత్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి రుక్వర్ధన్‌రెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, దమ్మాయిగూడ అధ్యక్షుడు సుమేశ్, జవహరనగర్ అధ్యక్షుడు వినయ్, పోచారం అధ్యక్షుడు యుగేందర్, మేడ్చల్ అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు బీరప్ప, సాయిరాంరెడ్డి, మహేశ్, సాయి, సాయిచరణ్, సాయికుమార్, కృష్ణ పాల్గొన్నారు.

నేటినుంచి 100 రోజుల పాటు స్వచ్ఛ్ సర్వేక్షణ్

అల్వాల్: స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టేందుకు జీహెచ్‌ఎంసీ 100 రోజుల పాటు ప్రజల వద్దకు స్వచ్ఛ్ సర్వేక్షణ్ కార్యక్రమం చేపట్టింది. మంగళవారం నుంచి అన్ని విభాగాల అధికారులు కాలనీల్లో పర్యటించనున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ నాగమణి తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో పలు విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. విద్యుత్, పోలీస్, ట్రాఫిక్, జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు హాజరయ్యారు. మొదటి రోజు సర్కిల్ పరిధిలోని వెంకటాపురం డివిజన్ భూదేవినగర్‌లో మంగళవారం 100 రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతున్న డీసీ, ఏఎంహెచ్‌ఓ

ప్రభుత్వ భూమి కాపాడాలంటూ ప్రజావాణిలో వినతి



ప్రజావాణిలో వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వే నంబర్– 63/1లోని ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ సోమవారం ప్రజావాణిలో మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు సీపీఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. గుట్టను చదువును చేసి రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో పలు మార్లు ఫిర్యాదు చేసినా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కబ్జాదారుల నుంచి సదరు ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు వినతిలో కోరారు. మేడిపల్లి మండల సీపీఐ కార్యదర్శి రచ్చ కిషన్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్, మాచర్ల కనకయ్య, ఉప్పల కొమురయ్య తదితరులున్నారు.

సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేయాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి

బోడుప్పల్: సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేయాలని బీఆర్‌ఎస్ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. 13వ డివిజన్ కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన డివిజన్ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు నడవాలన్నారు. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌తో పాటు ఇతర సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నాయకులు జిడిగె రమేష్‌యాదవ్, దానగల్ల యాదగిరి, డివిజన్ అధ్యక్షుడు గోపు రాము, నేతలు జెన్న రాజు, బైరికొండ మల్లేష్, ఎండీ అఫ్జల్, సుధాకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మైనార్టీల జీవితాల్లో వెలుగులు



చర్లపల్లిలో రంజాన్ తోఫాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసి మైనార్టీల జీవితాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. రంజాన్ సందర్భంగా సోమవారం చర్లపల్లిలోని అబుబాకర్ మజీద్‌లో ముస్లింలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. బతుకమ్మ, క్రిస్మస్, రంజాన్ తోఫాలను అందజేసి రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, కనకరాజుగౌడ్, ప్రభుగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, కొమ్ము సురేష్, హరినాథ్, శేఖర్‌నాయక్‌తో పాటు ముస్లింలు నయీమ్, అన్వర్, హలీం, ఖాదర్, కరీం, నజీమ్, మునీఫ్, షరీఫ్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

మల్కాజిగిరి: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన కానుకలను ఓల్డ్ నేరెడ్‌మెట్‌లోని చందాబీబీ మజీద్‌లో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు జిలాని, ఇస్మాయిల్, నవీద్, ఇక్బాల్, జాఫర్, నాయకులు నందుయాదవ్, మురళి, శరత్, కిషన్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు. మౌలాలి కస్తూర్బానగర్ కమ్యూనిటీ హాల్‌లో రంజాన్ కానుకను ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు అహ్మద్, గౌస్, గఫూర్, నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

మల్కాజిగిరి: ప్రధాన రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ ఎస్‌ఎండీసీ కాలనీ నుంచి తాళ్లబస్తీ వరకు రూ.20 లక్షలతో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ప్రధాన రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు తొలగించాలని విద్యుత్ విభాగం ఏఈ వెంకటేష్‌కు సూచించారు. రోడ్డు విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్ పనులు జరుగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్, బాబు,సత్యనారాయణ,సంపత్ పాల్గొన్నారు.



రహదారి నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

ఆ నాలుగు ఎకరాలు గౌడ కులస్తులవే..



అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయికులు

మేడిపల్లి: మేడిపల్లి సర్వే నంబర్ 48లో 4ఎకరాల 18 గుంటల భూమి గౌడ కులస్తులదేనని 58, 59 జీవో ప్రకారం ఇచ్చిన పట్టాలను వెంటనే రద్దు చేయాలని మేడిపల్లి కల్లుగీత కార్మిక సహకార అధ్యక్షుడు చెరుకు మహేష్ ఆధ్వర్యంలో పీర్జాదిగూడ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డికి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలుగా ఇక్కడ వ్యవసాయం చేసుకుంటూ, కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్నామని, అలాంటి భూమిలో ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం చొరవ తీసుకుని మేడిపల్లి గౌడ కులస్తులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బోయినపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేశగోని శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేటర్ పాశం శశిరేఖ బుచ్చియాదవ్, సభ్యులు నాగయ్యగౌడ్, చెరుకు పెంటయ్యగౌడ్, బందారం రాముగౌడ్, పుట్టపాక కుమార్‌గౌడ్, పల్లె బాల్‌రాజ్‌గౌడ్, చెరుకు శివగౌడ్, పల్లె శరత్‌గౌడ్, మెట్టు శ్రీనుగౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

రామంతాపూర్: ఓల్డ్ రామంతాపూర్‌లోని బొడ్రాయి సప్తమ వార్షికోత్సవ వేడుకలు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పంచగవ్య పూజ, 108 కళశాలతో బొడ్రాయికి అభిషేకం, పూర్ణాహుతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావుతో పాటు సర్వబాబు యాదవ్, సుర్వి మురళీగౌడ్, రేవు నరసింహ, కాంగ్రెస్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి, సీనియర్ రాష్ట్ర కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి, గంధం జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

సీవీరామన్ యంగ్ జీనియస్ పరీక్షల్లో విద్యార్థి ప్రతిభ



మేడిపల్లి: సుచరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సీవీ రామన్ యంగ్ జీనియస్ పరీక్షల్లో రవీంద్రభారతి స్కూల్ బోడుప్పల్ విద్యార్థి పి.తేజేంద్రవర్మ జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ రజిత పుష్ప గుచ్ఛంతో విద్యార్థిని అభినందించారు.

చర్లపల్లి జైలులో కంటి వెలుగు



చర్లపల్లి జైల్‌లో ఖైదీలకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని జైలు పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్ ప్రారంభించారు. అనంతరం ఖైదీలకు కంటి పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, కంటి వైద్య నిపుణురాలు పద్మ, ఏఎన్‌ఎం ఉషారాణి, స్వర్ణ, సందీప్, విమలతో పాటుగా జైల్ సిబ్బంది శశికాంత్, పరశురాములు, జ్యోతీశ్వర్ రెడ్డి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతి ఆలయంలో హోమాలు



అల్వాల్: కానాజీగూడలోని మరకత శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో దేవస్థానంలో ఏడో వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఉదయం నుంచి సుప్రభాత సేవ, విశేష అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమం, లక్ష్మీనరసింహ హోమం, కుబేర హోమం, చండీ హోమం మృత్యుంజయ రుద్ర హోమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ఆలయ వ్యవస్థాపక నిర్వాహకులు మోత్కూరు సత్యనారాయణ శాస్త్రీ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. పవర్ శర్మ యాగాచార్యులు హోమాలు నిర్వహించారు.

వివాహిత ఆత్మహత్య

మేడిపల్లి: వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఆర్.కిషోర్ భార్య వాణిప్రియాంక(25)తో కలిసి బోడుప్పల్ బొల్లిగూడెం సూరజ్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. వీరికి నాలుగేళ్ల పాప ఉంది. కొంత కాలంగా కుటుంబ తగాదాలు ఉన్నాయి. ఈ మధ్య కాలంలో సమస్యలు అధికం కావడంతో మనస్థాపానికి గురైన ప్రియాంక సోమవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వరకట్నం వేధింపులతోనే ఆమె మృతిచెందిందని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ఘట్‌కేసర్: పట్టణంలోని శివారెడ్డిగూడ శ్రీప్రసన్న వీరాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో స్థానిక నేత కొంతం రాంరెడ్డి సుగుణ దంపతులు ఆయన తండ్రి దివంగత బాల్‌రెడ్డి జ్ఞాపకార్థం సోమవారం పేదలకు దుస్తులను అందజేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రైతు బంధు మండల కో ఆర్డినేటర్ అంజిరెడ్డి, నరసింహారెడ్డి, కష్టారెడ్డి, కోటేశ్వర్‌రావు, ఓంకార్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.